

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఇదో తెగులు

**అంతదాకా ఆవిడ** మా అమ్మతో ఎంచక్కా తెలుగులో మాట్లాడింది. "మరే పిన్నిగారూ, మన గోదావరి జిల్లా వాళ్ళ వంటలు బావుంటాయి. నాకు ఆవపెట్టిన కూరలిష్టం. ముఖ్యంగా పనసపొట్టు కూర" అంటూ. అంతలో వాళ్ళ మనవడు వచ్చాడు లోపలనుండి "నానమ్మా" అంటూ.

"అభీ...గెట్ ఇన్ సైడ్ ఐ యామ్ స్పీకింగ్ విత్ అమ్మమ్మగారు. యూ గో ఎండ్ హేవ్ యువర్ చేగోడీస్" అంది.

"బాబుకి తెలుగురాదా అమ్మా?" అంది మా అమ్మ.

"వచ్చండీ. కానీ ఇంగ్లీష్‌లోనే మాట్లాడ్తాం అందరం. రేపు స్కూల్‌కి వెళ్తే తెలుగులో మాట్లాడ్తే కష్టం" అని.

మా అమ్మ "తెలుగులో మాట్లాడితే కష్టం అని ఇంట్లోనూ ఇంగ్లీష్‌లో మాట్లాడ్తారా?" అని ఆశ్చర్యంగా అడిగింది. నేను ఇదంతా బాల్కనీలో కూర్చుని చూస్తున్నాను. అమ్మ లోపలికొచ్చాకా చెప్పాను. "అమ్మా తెలుగులో మాట్లాడడం అనాగరికం. అసలు కుక్కలతో, పిల్లలతో మాతృభాషలో అస్సలు మాట్లాడకూడదు. నీకు తెలీదు" అని నవ్వాను.

నేను ఓ తెలుగు టీ.వీ ఛానెల్‌లో పని చేసేదాన్ని. అందులో సీ.ఈ.ఓ దగ్గర నుండి అన్ని పెద్ద డిసిగ్నేషన్‌ల్‌నూ తెలుగేతరులనే ఏర్చి కూర్చి నియమించారు. ఇంక తెలుగువాళ్ళు కూడా ఇంగ్లీష్‌లో తప్ప మాట్లాడేవారు కారు. అదీ బట్లర్ ఇంగ్లీష్‌లో "హీ డోంట్ వాంట్ టూ" "వన్ ఆఫ్ మై ఫ్రెండ్" ఇలా గ్రమేటికల్ మిస్టేక్స్ మాట్లాడితే మా అమ్మమ్మా వెంటనే రెన్ అండ్ మార్టిన్ గ్రామర్ బుక్ తీసుకొచ్చి ట్యూషన్ చెప్పేది. హీ, షీ, ఇట్‌లకి డజ్ రావాలి. వన్ ఆఫ్ ది అన్నప్పుడు ఫ్రెండ్ కాదు ఫ్రెండ్స్ అనాలి అని. ఇంక "టెంపర్ వరీ, ఎగ్రెస్టా" లాంటివి వీళ్ళు తయ్యారు చేసుకున్న వకాబ్లరీ.

అసలు ఈ మధ్య ఓ తెలుగు వెబ్ ఛానెల్ ఓనర్‌లాంటి పెద్ద మనిషిని అడిగాను. అక్కడ "హెడ్స్"కి (ఈ మాటతో వాళ్ళని పిలిస్తే నాకు తెగ నవ్వొస్తుంది. నేతి బీరకాయలో నెయ్యి మాదిరి, ఈ పోస్ట్) వీళ్ళకి ఒక్క తెలుగు పదం రావట్లేదు పాపం తెలుగులో వెబ్ సిరీస్ ఎలా తీస్తారు? అని.

"రాకూడదు" అన్నాడాయన.

ఖంగు తిని "ఏవిటి?" అన్నాను.

"అవును. తెలుగు పుస్తకాలు చదవని వాళ్ళనీ, తెలుగు టీ.వీ సీరియల్స్ కానీ, సినిమాలకి కానీ రాయని వాళ్ళనీ మేం సెలెక్ట్ చేస్తాం. వీళ్ళు 'వెబ్' జెనరేషన్. వెబ్ సిరీస్ మాత్రమే చూస్తూ పెరిగినవాళ్ళు, వీళ్ళకి వేరే మాధ్యమాలు తెలియకూడదు. అలాగే తెలుగు మీరు చదివినదీ, మీరు రాసేదీ వీళ్ళకి రాకూడదు. ఇప్పటి యూత్‌కి తెలిసిన తెలుగే రావాలి" అన్నాడు.

"హాయ్ మేమ్.. హేవ్ యూ హేడ్ యువర్ లంచ్, నేను పొద్దుటే సద్దన్నం హేడ్, మా మెయిడ్ వెంట్ టూ హర్ ఆడబిడ్డ డెలివరీ, సో.. సింక్ ఈజ్ ఫుల్ ఆఫ్ అంట్లు"

అక్కడ పనిచేసే ఓ అమ్మాయి నాతో చాట్.

ఏ భాషా పరిపూర్ణంగా రాని వీళ్ళు మా కథలు విని జడ్జ్ చేస్తారుట. సరే.. వాళ్ళ టేస్ట్ పట్టి చేస్తారు. మా డ్రైవర్ "మెకన్నాస్ గోల్డ్" చూపించినా గట్ల కాకుండా ఎండింగ్‌ల గుర్రాల మీదే కూసుని ఫైటింగ్ పెట్టుండాల్సింది. నేనైతే గట్ల తియ్య" అని తన అభిప్రాయం వెల్లడిస్తాడు. సో.. వీళ్ళూ అభిప్రాయాలు చెప్పచ్చు. తప్పులేదు. కానీ ఇంకా విచిత్రమైన విషయం ఏంటంటే, ఇంగ్లీష్ నావెల్స్ ఇండియన్ రైటర్స్ అనువదించినవి. "ఇంటర్నేషనల్ బుక్స్" అని కొంటారట. తర్వాత ముంబైలో "వెబ్ రూం" అని ఓ గ్రూప్ ఆఫ్ హిందీ రైటర్స్ చేత వాటి స్క్రీన్ ప్లే చేయిస్తారుట. తెలుగులో స్క్రీన్ ప్లే చేయగలిగిన వాడు ఇంకా పుట్టలేదుట. ఆ హిందీ స్క్రీన్‌ప్లేని. ఇక్కడ తెలుగులో వీళ్ళు అపాయింట్ చేసుకున్న పిల్లమూక చేత తెలుగులో రాయించి, తెలుగు వెబ్ సిరీస్ తీస్తారుట "ఓ మైగాడ్ బడ్జెట్ విల్ బి హ్యూజ్" అన్నాడు. ఇలాంటి పనులు చేస్తూ. ఇది వీళ్ళ గొప్ప స్ట్రాటజీ అని చెప్తున్న వీళ్ళు కానీ వేరొకళ్ళు కానీ డైరెక్ట్‌గా తెలుగులో అదిరిపోయే వెబ్ సిరీస్ ఇంతదాకా తియ్యలేదు, ఇక ఈ వెబ్ సిరీస్‌లు గురించిన ప్రజాభిప్రాయాలు దారుణంగా, గగ్గోలుగా వుంటాయి.

ఒక తెలుగు రచయిత పుస్తకానికి పది లక్షలు రైట్స్ అడిగితే విరుచుకు పడిపోయే వాళ్ళు అది ఓ లక్షకో, రెండు లక్షలకో చవకగా కొట్టేసి, దానిమీద ఎంతైనా ఖర్చు పెట్టి, చివరికి తీసే వెబ్ సిరీస్ ఎంత ఘోరంగా వుంటున్నాయో నేను వేరే చెప్పక్కర్లేదు. ఇదంతా పాపం యూత్ చేస్తున్నారా? అంటే వాళ్ళ మీద ఓ అరవై, డెబ్బై ఏళ్ళ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వుండి విని, అదంతా మార్పిస్తారు. లాస్ట్‌కి అది రెంటికీ చెడిన రేవడి అయి బయటకొస్తుంది.

ఇంక సెన్సార్ అనేది లేని ఈ వెబ్ సిరీస్‌కి పైన "సెక్స్, ఫౌల్ లాంగ్వేజ్, డ్రగ్స్ అండ్ వయొలెన్స్" అనే డిస్‌క్లైమర్ వేసేస్తే చాలు. ఏమైనా మాట్లాడచ్చు, ఏదైనా చూపించచ్చు. పైన రాసాంగా మీ ఖర్మ. అన్నట్లు వుంటుంది. ఈ మధ్య పేరు తమాషాగా వుందని ఓ బట్టలమ్ముకునే వాడి బయోపిక్ అంటే పొరపాట్న చూద్దామని మొదలుపెట్టాను. మొదటి సీన్ నుండి చివరిదాకా బూతులే, సెక్సే. అసలు సభ్యతా సంస్కారం అనేది ఎక్కడా టార్చ్ లైట్ వేసినా, చూసినా లేదు. ఇంకొక తెలుగు వెబ్ సిరీస్ 'దేవుడి పేరు మీద' అనే అర్థంతో టైటిల్, టీ.వీలో పెట్టినందుకు ఫినాయిల్ వేసి కడుక్కునే పరిస్థితి.

కొన్ని సినిమాల్లో హీరో అమ్మాయిల్ని బస్‌లో సీట్ మీద కర్చీఫ్ వేసి, "ఇది నా సీట్" అన్నట్లుగా "ఇది నా పిల్ల" అనటం ట్రెండింగ్ అయిపోయింది, ప్రతి వాడూ అది హీరోయిజం అనుకున్నాడు. కన్నతండ్రి ముందే ఆ పిల్లని ముద్దు పెట్టుకుంటూ "మేనర్స్ లేదా? ఇద్దరు ముద్దు పెట్టుకుంటుంటే, ఇటు రాకూడదని తెలిదా?" అంటే చప్పట్లు, ఈలలు, క్లాప్స్, వీళ్ళకి అక్క చెల్లెళ్ళూ, కూతుళ్ళూ వుంటే, రేపు అదేమాట వీడి కూతుర్ని ముద్దు పెట్టుకుంటూ, ఎవడైనా అంటే, అప్పుడు కొట్టమనండి చప్పట్లు.

తెలుగు సినిమా ‘భక్త ప్రహ్లాద‘ నుండి, రచయితలు చందాల కేశవదాసు నుండి, సముద్రాల, దాశరధి, అప్పలాచార్య, ఆత్రేయ, సిరివెన్నెల దాకా ఎన్ని రకాలుగా సాహిత్య పోకడలు, సులభతరం అవుతూ, విలువలు తరగకుండా సులభతరం కావడానికి ఇన్ని దశకాలు పడితే తెలుగుకి తెగులు పట్టి బూతులు మాత్రమే డైలాగ్స్ రాయడానికి కేవలం అయిదేళ్ళు పట్టింది. అయిదేళ్ళ క్రితం దాకా ఫ తో మొదలయ్యే మాటలు వుండేవి కాదు. సీసాలూ, గ్లాసులూ, తాగుడూ, "మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం" అన్న హెచ్చరికలు ఓల్డ్ ఫ్యాషన్, తల్లి అయినా, పిల్ల అయినా, జేబులోంచి, చిన్న పొట్లం తీసి, అందులో పొడిని టేబుల్ మీద పోసి, పేపర్ని గొట్టంలా చేసి, దాన్ని ముక్కుతో పీల్చి, పరమానందం అనే మత్తులో తేలియాడడం సర్వసాధారణం, ఆడపిల్లలని ఎత్తుకుపోయి అమ్మేయడం మొక్కజొన్న పొత్తులు అమ్మినంత తేలిగ్గా చూపిస్తున్నారు. హత్యలయితే, వంకాయలు తరిగినట్లే తలకాయలు తరగడం. పదోక్లాసు పిల్లలనుండీ, బోయ్ ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్, సిగరెట్లూ, మాదక ద్రవ్యాలూ. దానికి పర్యవసానం మొన్న ఆగస్ట్ 15 2021న రమ్య అనే అమ్మాయి ఫేస్ బుక్ ఫ్రెండ్‌ట, తనని ప్రేమించినట్లు నటించి, ఇప్పుడు మాట్లాడడం లేదని, పట్టపగలు ఆంధ్రాలో జనసమర్ధమైన చోట, టిఫిన్ తీసుకురాడానికి బండి దగ్గరకొచ్చిన అమ్మాయిని పీక కోసి చంపాడు. ఇంకోడు ఇంట్లోకి బాల్కనీలోంచి ఎక్కి నరికి చంపాడు ఓ అమ్మాయిని, ఇంకో ప్రబుద్ధుడు ఫోన్‌లో ఇంకో ఫ్రెండ్‌కి "చూడు చంపేస్తున్నా.. చంపేస్తున్నా" అంటూ ఆమె కేకలూ, ఏడుపులూ అవతలవాడికి వినిపిస్తుండగా, పొడిచి చంపేసాడు. అవతల వింటున్నవాడు తెగ వినోదించాడు వీడి హీరోయిజానికి.

ఇదంతా సెన్సార్ బోర్డ్ పరిధిలోకి రాని వెబ్ ప్రభావం అని నేనంటే, ‘ఓల్డ్ ఫ్యాషన్డ్‘ అంటారు. అమ్మాయిలు సిగరెట్ కాలుస్తున్నారనో, పొట్టి బట్టలేసుకున్నారనో, బోయ్ ఫ్రెండ్స్‌తో వివాహపూర్వ సంబంధాలలో వుంటున్నారనో, పెద్దవాళ్ళు అంటే "డోంట్ జడ్జ్ దెమ్" అనేస్తారు. కానీ నాలాంటి రైటర్స్ చీరకట్టుకుని వెళ్తే, చేతిలో సిగరెట్ పట్టుకోకపోతే ఈ అమ్మాయిలు "ఆంటీ ఈజ్ ఓల్డ్ ఫ్యాషన్డ్, "అరె చిల్ ఆంటీ.. డోంట్ మైండ్" అనో, "అబ్బా! డోంట్ రైట్ బుకిష్ లాంగ్వేజ్" అనో జడ్జిమెంటల్‌గా వుంటున్నారు.

నన్నో పిల్ల (ముప్పై ఏళ్ళ పైగా వున్నా, వేషం ఎల్.కె.జీ పిల్ల గౌన్‌లో వుంది) వయసు తెలిసినా చెప్పకూడదుట. అది బాడీ షేమింగ్‌లోకే వస్తుందిట. మరి మనని ఆంటీ అనచ్చు(మనకన్నా రెండేళ్ళు చిన్నది) "దిసీజ్ బుకిష్ లాంగ్వేజ్" అంది.

"నీ అసంతృప్తి అరిచే కేక, నీ నోరు కాదు కళ్ళు చూస్తే వినిపిస్తోంది" అని రాసానని.

నేను వెంటనే "ఔనమ్మా బుకిష్ లాంగ్వేజే. ఏం పుస్తకాలు చదివావు? ఇంగ్లీష్‌లో సిడ్నీ షెల్డన్, జెఫ్రీ ఆర్చర్, ఐయాన్ రాండ్, పీ.జీ వుడ్ హౌస్, జాన్ గ్రిషమ్ చదివావా? తెలుగులో విశ్వనాధ, చలం, రంగనాయకమ్మ, కోడూరి, యద్దనపూడి, యండమూరి, మల్లాది, కొమ్మూరి.. వీళ్ళవి ఏమైనా చదివావా? ఏ బుక్‌లో లాంగ్వేజ్ అంటావ్ ఇది? ఏదైనా లాంగ్వేజ్‌లో నీకు తెలిసిన అయిదు పుస్తకాల పేర్లు కానీ, రైటర్ల పేర్లు కానీ చెప్పు" అన్నాను.

ఓ టీ.వీ ఛానెల్‌లో ఏంకర్ నన్ను ఇంటర్వ్యూ చేస్తూ "ఓ మైగాడ్ తెలుగులో కూడా నావల్స్ వుంటాయా?" అంది. అదీ మన దౌర్భాగ్యం.

"హౌరా...ఎంటెంట వింట బోజ్జనం" అనే ఏడ్స్ ప్రముఖ తెలుగు తారల చేత ఇప్పిస్తుంటే చూసి తెలుగు భాష ఆఖరి దశ చూస్తున్న నరకం అనుభవిస్తున్నాం. ఆ మధ్య అంతా తెలుగు భాష అంతరిస్తోంది... అంతరిస్తోంది అంటూ గొంతులు చించుకుని ఉపన్యాసాలు ఇచ్చారు. ఇలా వెంటిలేటర్ మీద వుండి, తన సౌందర్యాన్నీ, పవిత్రతనీ చెరుస్తుంటే పడి వుండడం కన్నా అంతరించడమే మేలేమో. ఒకప్పుడు పాళీ, పిశాచీ లిపిలున్నట్లే, ‘తెలుగు‘ అనే భాష వుండేది. రచయితలు కవిత్వం

రాసేవారు. ఆ భాషలో నవలలొచ్చేవి సినిమాలు ఇలా సెక్స్ క్రైమ్ డ్రగ్స్, వయొలెన్స్ మార్కులు లేకుండా అవి ఇంటిల్లిపాదిమీ హాయిగా చూసే వాళ్ళం.

ఇంత పెద్ద పెద్ద హోమ్ థియేటర్లున్నా పిల్లలకీ ఇంట్లో పెద్దవాళ్ళకీ జడిసి, చిన్న స్మార్ట్ ఫోన్‌ల్లోనే ఈ వెబ్ సిరీస్ చూసుకునే ఖర్మ వుండేదికాదు. అని చెప్పుకునే రోజులొచ్చేసాయి. ఈ వెబ్ ఛానెళ్ళ ‘సాలెగూళ్ళ‘ సంస్కృతి నుండి (ప్రతి కీటకాన్నీ సాలె పురుగు లాక్కున్నట్లే వీళ్ళూ ఆడియెన్స్‌ని లాక్కుని ‘గ్లూ‘ చేసేసుకుంటారు) మన ‘భాష‘ ని రక్షించే నాధుడు లేడు. లేడు గాక లేడు.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4